# డ్రగ్స్‌పై ఉక్కుపాదం



సమావేశంలో మాట్లాడుతున్న సిటీ పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

- రెండు నెలల్లోనే డ్రగ్ ఫ్రీ సిటీ లక్ష్యాన్ని చేరుకోవాలి
- బేసిక్ పోలీస్, ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టండి
- సిటీ పోలీస్ సిబ్బందికి సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి దిశా నిర్దేశం

సిటీబ్యూరో, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నుంచి డ్రగ్స్‌ను పూర్తిస్థాయిలో తరిమి వేయాలని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. డ్రగ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు ఎక్కువ సమయం తీసుకోవద్దని, రెండు, మూడు నెలల్లోనే అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న తరువాత మొదటి సారిగా నగర కమిషనరేట్‌లోని డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లోని ఆడిటోరియంలో ఆదివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి ఆయా విభాగాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బేసిక్ పోలీసింగ్, కేసుల దర్యాప్తు, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రగ్స్‌ను తుది ముట్టించడం వంటి అంశాలపై సీపీ మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నివారణపై దృష్టి పెడుతూ ప్రజలకు సేవ చేయాలన్నారు. తప్పు చేసిన వారిపై కఠినంగా ఉండాలని, చట్టాన్ని గౌరవించే వారితో ఫ్రెండ్లీ పోలీసింగ్ చేయాలని సూచించారు. ప్రజలు ఠాణాలకు స్వేచ్ఛగా వచ్చి ఫిర్యాదులు ఇవ్వాలని, ఠాణాకు వచ్చే వారందరినీ సమాన దృష్టితో చూడాలని సిబ్బందికి సూచించారు. కేసుల దర్యాప్తు పారదర్శకంగా, వేగంగా జరగాలన్నారు. పెండెన్సీ ఉండవద్దని, కేసుల దర్యాప్తులో పక్కా సాక్ష్యాలను సేకరించి నిందితులకు శిక్షలు పక్కాగా పడేలా పకడ్బందీగా దర్యాప్తు ఉండాలన్నారు. ట్రాఫిక్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ అంశం నేరుగా ప్రజలతో సంబంధం ఉంటుందన్నారు. ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై దృష్టి పెట్టాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. డ్రగ్స్ సమాజానికి పట్టిన చీడపురుగని, దీనిపై ఉక్కు సంకల్పంతో పనిచేయాలన్నారు. డ్రగ్స్‌ను రాష్ట్రం నుంచి తరిమివేయాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంటామని, ప్రజాపాలనలో ప్రజలకు పారదర్శకమైన సేవలందించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు సీపీ శివప్రసాద్, జాయింట్ సీపీలు గజారావు భూపాల్, పరిమళ హన నూతన్, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న మిలిటరీ అధికారులతో ఆర్మీ అధికారులు

## ఎంసీఈఎంఈలో ఘనంగా స్నాతకోత్సవం

బొల్లారం, డిసెంబర్ 17: దేశ రక్షణ వ్యవస్థలో మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీరింగ్ (ఎంసీఈఎంఈ) కీలక పాత్ర పోషిస్తున్నదని ఎంసీఈఎంఈ కమాండెంట్, లెఫ్టినెంట్ జనరల్ సిధానా అన్నారు. ఆదివారం తిరుమలగిరి ఎంసీఈఎంఈ ఆడిటోరియంలో 104వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనరల్ మనోజ్ పాండే (పీవీఎస్ఎం, ఏవీఎస్ఎం), రాయల్ భూటాన్ ఆర్మీ, శ్రీలంక ఆర్మీ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈ 104 (టీఈఎస్-40) కోర్సులో శిక్షణ పూర్తి చేసుకున్న 33 మిలిటరీ అధికారులకు ఇంజినీరింగ్ పట్టాలను అందజేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు గోల్డ్, సిల్వర్ పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మిలిటరీ అధికారులు, ఎంసీఈఎంఈ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ గేమ్ యాప్ మోసం..

- లాభాల పేరుతో రూ.3.56 కోట్లు టోకరా
- మధురానగర్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు

వెంగళరావునగర్, డిసెంబర్ 17 : ఆన్‌లైన్ గేమ్స్ యాప్‌లో పెట్టుబడులు పెడితే లాభదాయకమైన వాటాలిస్తామంటూ నమ్మబలికిన మోసగాళ్లు రూ. 3.56 కోట్లకు పైగా దోచుకున్నారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. వారాసిగూడకు చెందిన కె.వెంకటరమణ, కూకట్‌పల్లికి చెందిన యు.ఉమాశంకర్, భీమవరానికి చెందిన డి.తరుణ్‌చంద్ర కలిసి తాము ఆన్‌లైన్ గేమ్స్, ట్రిప్ సొల్యూషన్స్ కంపెనీని నిర్వహిస్తున్నట్టుగా 2019లో మధురానగర్‌కు చెందిన మెట్టు సుమంత్‌కుమార్‌రెడ్డికి కలిసి చెప్పారు. తమ కంపెనీ నిర్వహించే ఆన్‌లైన్ యాప్స్‌లో లైవ్, స్పోర్ట్స్, ఈవెంట్స్ వేడుకలను నిర్వహిస్తామని నమ్మించారు. తమ కంపెనీలో పెట్టుబడులు పెడితే లాభదాయకమైన వాటాలిస్తామని నమ్మబలికారు. తమ కంపెనీకి లక్ష మంది క్లయింట్స్ ఉన్నారని, సబ్ స్క్రైబర్స్ బాగున్నారని, ఫ్రీహిట్ ఫాంటసీ పేరిట మరో కంపెనీని కూడా స్థాపించామని తెలిపారు. వీరి మాటలు నమ్మిన మెట్టు సుమంత్‌కుమార్‌రెడ్డి పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించాడు. 2020లో ఎంఓయూ. కుదుర్చుకున్నారు. ఫ్రీ హిట్ ఫాంటసీ కంపెనీలో సుమంత్‌కుమార్‌రెడ్డి రెండు దఫాలుగా రూ.3,56,73,334 పెట్టుబడిగా పెట్టాడు. అతడితోపాటు వెంకట ఫణీంద్ర కూడా సదరు కంపెనీలో పెట్టుబడులు పెట్టాడు. కంపెనీలో పెట్టిన పెట్టుబడులకు లాభాలు ఇవ్వకపోవడంతో ఆరా తీశారు. తీరా అసలు యాప్స్ అంతా బోగస్ అని.. ఎలాంటి యాప్స్‌ను నిర్వహించడం లేదని తెలుసుకొని ఖంగుతిన్నారు. తమ నుంచి తీసుకున్న కోట్లాది రూపాయలు తిరిగి ఇచ్చేయాలని కోరినా ఇవ్వకపోవడంతో చివరికి తాము మోసపోయామని గ్రహించిన బాధితుడు సుమంత్‌కుమార్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## టీవర్క్స్‌లో ముగిసిన మేకర్ ఫెయిర్ హైదరాబాద్

- హాజరైన వేలాది మంది ఔత్సాహిక ఆవిష్కర్తలు

సిటీబ్యూరో, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): టీ వర్క్స్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన 'మేకర్ ఫెయిర్ హైదరాబాద్' ఆదివారంతో ముగిసింది. దేశ వ్యాప్తంగా 30 వేల మందికి పైగా వివిధ అంశాలకు చెందిన ఆవిష్కర్తలు పాల్గొని రకరకాల వస్తువుల నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. పిల్లల నుంచి మొదలుకొని పెద్దల వరకు తమ సృజనాత్మక ఆలోచనలకు అనుగుణంగా వస్తువులను మేకర్ ఫెయిర్‌లో తయారు చేసి చూపించారు. మేకర్ ఫెయిర్‌లో సేఫ్టీ అలర్ట్ హెల్మెట్‌ను ఎస్.కె.రాజాలి పాషా, ఆటోమేటెడ్ వాల్వ్ కంట్రోల్ సిస్టంను ఎం.గోపాల్ సింగ్, అసిస్టివ్ కిచెన్ డివైస్‌ను పి.వీనీల, వెల్లె శ్రీనివాస్ మోటర్ కంట్రోల్ సిస్టంను ప్రదర్శించారని తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ సీఐఓ శాంతా తౌటం తెలిపారు. అదేవిధంగా.. అడిటివ్ మాన్యుఫాక్చరింగ్ ఇన్నోవేషన్, ఆటోమేటెడ్ ఇన్నోవేషన్, ఫర్టిలైజర్ ఇంజెక్టర్, టెంపరేచర్ టెక్నాలజీస్ వంటి అంశాలపై పలువురు ప్రదర్శనను ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు జరిగిన మేకర్ ఫెయిర్ హైదరాబాద్ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందని, సుమారు 30వేల మంది టీ వర్క్స్‌ను సందర్శించి, రకరకాల వస్తువులను తయారు చేయడంతో పాటు ప్రదర్శించారని శాంతా తౌటం తెలిపారు.

## వాహనానికి స్కూటీని అడ్డంగా పెట్టి..

నగదు దోచుకుపోయిన దుండగులు.. శంషాబాద్ మండలంలో ఘటన

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 17 : వాహనానికి స్కూటీని అడ్డంగా పెట్టి, కత్తులతో డ్రైవర్లను భయపెట్టి దుండగులు నగదు దోచుకుపోయారు. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ కుమార్ కథనం ప్రకారం.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి మండలం కిష్టగిరి గ్రామానికి చెందిన జె.రమేశ్, రాములు డ్రైవర్లు. అశోక్ లీల్యాండ్ వాహనాన్ని తీసుకొని వనపర్తి నుంచి హైదరాబాద్ వైపు వస్తున్నారు. శంషాబాద్ మండలం పీ1 రోడ్డులోని గొల్లూరు క్రాస్ రోడ్డు వద్దకు ఆదివారం తెల్లవారుజాము 2.20 గంటల సమయంలో చేరుకున్నారు. అక్కడున్న ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు వీరి వాహనానికి అడ్డంగా స్కూటీని పెట్టారు. డబ్బులివ్వాలంటూ కత్తులు చూపించారు. హిందీలో మాట్లాడుతూ బెదిరించారు. దుండగుల బెదిరింపులకు భయపడిన డ్రైవర్లు వారివద్దనున్న రూ. 1.35 లక్షలు ఇచ్చారు. దీంతో దుండగులు అక్కడి నుంచి పెద్దగోల్కొండ టోల్‌గేట్ వైపు వెళ్లినట్టు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఏసీపీ రాంచందర్‌రావు, ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమెరాలను పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తామని ఏసీపీ తెలిపారు.

## గ్రేటర్‌లో 14 మంది ఐపీఎస్‌ల బదిలీ

సిటీబ్యూరో, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): నగరంలో 14 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేయడంతో పాటు పలువురికి పోస్టింగ్‌లు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో ఎస్‌బీ అదనపు కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పి.విశ్వప్రసాద్‌ను అక్కడి నుంచి బదిలీ చేసి, అదే కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ అదనపు సీపీగా పోస్టింగ్ ఇచ్చారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న ఏవీ.రంగనాథ్‌కు నగర కమిషనరేట్‌లోని క్రైమ్స్, సిట్ జాయింట్ కమిషనర్‌గా పోస్టింగ్ కల్పించారు. ఇంటెలిజెన్స్ ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.విజయ్‌కుమార్‌ను అక్కడి నుంచి బదిలీ చేసి, వెస్ట్‌జోన్ డీసీపీగా పోస్టింగ్ కల్పించారు. వెస్ట్‌జోన్ డీసీపీగా ఉన్న జోయల్ డేవిస్‌ను అక్కడి నుంచి ఎస్‌బీకి బదిలీ చేశారు. మెదక్ ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న రోహిణి ప్రియదర్శినిని నగరంలోని నార్త్‌జోన్ డీసీపీగా బదిలీ చేశారు. నార్త్‌జోన్ డీసీపీ చందనాదీప్తిని అక్కడి నుంచి బదిలీ చేసి, డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. సిద్దిపేట పోలీసు కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎన్.శ్వేతను అక్కడి నుంచి బదిలీ చేసి, నగర కమిషనరేట్‌లోని డీడీ డీసీపీగా పోస్టింగ్ కల్పించారు. వెయిటింగ్‌లో ఉన్న ఎ.సుబ్బరాయుడికి నగరంలో ట్రాఫిక్-1డీసీపీగా పోస్టింగ్ కల్పించారు. నగర టాస్క్‌ఫోర్స్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న నితిక పంత్‌ను అక్కడి నుంచి బదిలీ చేసి, డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. నగర క్రైమ్స్, సిట్ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న గజారావు భూపాల్‌ను అక్కడి నుంచి బదిలీ చేసి, డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. వెయిటింగ్‌లో ఉన్న ఎన్.వెంకటేశ్వర్లుకు హైదరాబాద్ ట్రాఫిక్-3 డీసీపీగా పోస్టింగ్ కల్పించారు. ట్రాఫిక్-3డీసీపీగా పనిచేస్తున్న డి.శ్రీనివాస్‌ను అక్కడి నుంచి బదిలీ చేసి, డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. రాచకొండ కమిషనరేట్‌లోని రోడ్ సేఫ్టీ విభాగంలో డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీబాలాదేవిని అక్కడి నుంచి బదిలీ చేసి, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా పోస్టింగ్ కల్పించారు. మాదాపూర్ డీసీపీ జి.సందీప్‌రావును అక్కడి నుంచి బదిలీ చేసి, రైల్వే అడ్మిన్ ఎస్పీగా పోస్టింగ్ కల్పించారు. రైల్వే అడ్మిన్ ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న జె.రాఘవేంద్రరావును అక్కడి నుంచి బదిలీ చేసి, డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు.

## కుక్కదాడిలో బాలుడికి గాయాలు

ఎర్రగడ్డ, డిసెంబర్ 17: ఇంటి బయట ఆడుకుంటున్న పదేళ్ల బాలుడిపై పక్కింటి పెంపుడు కుక్క దాడి చేసింది. బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బోరబండ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్‌లోని శంషీర్ ఫంక్షన్ హాల్ సమీపంలో సయ్యద్ ఫతే అలీఖాన్ కుటుంబం నివసిస్తున్నది. అతడి కుమారుడు ఆలం దార్ నాలుగో తరగతి చదువుతున్నాడు. ఆ బాలుడు శనివారం ఇంటి ముందు ఆడుకుంటుండగా..పక్కింటికి చెందిన పెంపుడు కుక్క దాడి చేసింది. ఈ ఘటనలో బాలుడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. బాలుడు దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. బాలుడి తండ్రి ఆదివారం పక్కింటి పెంపుడు కుక్క యజమాని సతీష్‌కుమార్‌పై బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఉద్యోగం రాలేదన్న బెంగతో.. యువకుడి బలవన్మరణం

మియాపూర్ , డిసెంబర్ 17: నిరుద్యోగ సమస్యతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మియాపూర్ ఠాణా పరిధిలో జరిగింది. నెల్లూరుకు చెందిన పవన్ కల్యాణ్(25) బీటెక్ పూర్తి చేశాడు. మియాపూర్ పరిధిలోని దుర్గా కాలనీలో తన సమీప బంధువు ఇంట్లో ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ నెల 15న ఉద్యోగం వేటలో వెళ్తున్నట్టు తన బంధువుకు చెప్పి వెళ్లిన అతడు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో మియాపూర్ ఠాణాలో ఫిర్యాదు చేయగా.. మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శనివారం సాయంత్రం కాలిపోయి ఉన్న స్థితిలో ఓ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఆనవాళ్లను బట్టి పవన్ కల్యాణ్ మృతదేహంగా నిర్ధారించారు. ద్విచక్ర వాహనంతోపాటు నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు. మియాపూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.